విద్యార్థి మహాగర్జనకు తరలిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ

నవతెలంగాణ-కామారెడ్డి



హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో శుక్రవారం నిర్వహించిన విద్యార్థి మహాగర్జనకు కామారెడ్డి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు శుక్రవారం ఉదయం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదం అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వాటిని పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి మహాగర్జన తలపెట్టినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అద్దే భవనాల్లో నిర్వహిస్తున్న సంక్షేమ వసతిగృహాలకు సొంత భగవనాలు నిర్మించాలని, ప్రభుత్వ పాఠశాల మూసివేతను ఆపాలని, శిథిలావస్థకు చేరిన పాఠశాలలకు మరమ్మతులు చేయాలన్నారు. పాఠశాల అభివృద్ధికి కాంటీన్జెన్సీ నిధులు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 8,245 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీమేజ్మెంట్లను తక్షణమే విడుదల చేయాలని తదితర డిమాండ్లపై విద్యార్థి మహాగర్జన నిర్వహించినట్టు తెలిపారు.

ఉడికీఉడకని అన్నం

ఉపాధ్యాయులు, ఎంఈఓ పట్టించుకోవట్లే : పీడీఎస్‌యూ





నవతెలంగాణ-వర్ని

స్కూళ్లల్లో పెడుతున్న మధ్యాహ్నం భోజనం పిల్లల ఆకలి తీర్చడం లేదని పీడీఎస్‌యూ నాయకులు మండిపడ్డారు. ఉడికీ ఉడకని అన్నం పెడుతుండటంతో విద్యార్థులు తినలేకపోతున్నారని తెలిపారు. వర్ని మండం వడ్డేపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి శుక్రవారం నిరసన చేపట్టారు. ఉడకని, మాడిపోయిన భోజనం పెడుతున్నారని, మురిగిన కూరగాయలతో మధ్యాహ్నం భోజనం వండుతున్నారని ఆరోపించారు. కొన్ని నెలలుగా ఇదే విధంగా భోజనం పెడుతున్నట్టు విద్యార్థులు వాపోయారు. ఉపాధ్యాయులు, ఎంఈవో సైతం పట్టనట్టు వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. వెంటనే స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలు



- అపరిశుభ్రంగా హాస్టల్స్ పరిసరాలు
- కిటికీలకు లేని జాలీలు.. దోమలతో సహవాసం
- మరికొన్ని చోట్ల కోతుల బెడద

నవతెలంగాణ-విలేకరులబృందం

ఆర్థిక సమస్యలు, ఉన్నత చదువులకు అవకాశం లేక ఇతరాత్ర కారణాలతో పలువురు పిల్లలు తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్‌లలో ఉంటూ చదువుకుంటుంటారు. వారి ఆలనా పాలన చూసేది అధికారులే. అయితే పలు చోట్ల సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు నిర్వహణ సరిగ్గా లేక దోమలు విజృంభిస్తున్నాయి. దీనికి తోడు హాస్టల్ కిటికీలకు దోమతెరలు లేక, ఫ్యాన్‌లు తిరగక విద్యార్థులు దోమలతో సహవాసం చేస్తున్నారు. దీంతో పాటు బాత్‌రూంల నిర్వహణ సరిగా లేదు. డోర్‌లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. అధికారులు స్పందించి హాస్టల్‌లను తనిఖీలు చేసి చిన్నచిన్న మరమ్మతులు చేపడితే విద్యార్థులకు సౌకర్యాలు మెరుగయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు వసతిగృహాలను నవతెలంగాణ విలేకరుల సందర్శించగా విద్యార్థులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు.

విద్య, వైద్యం తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యతగా గుర్తించినట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంట్లో భాగంగా ఇది వరకే ఎంఈవోలను నియమించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పిల్లలు కోరుతున్నారు. చిన్నచిన్న సమస్యలు అధికారులు స్పందించి పరిష్కరిస్తే సౌకర్యాలు మరింత మెరుగయ్యే అవకాశం ఉంది.

కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో పరిసరాలు పిచ్చిమొక్కలను నిండిపోయాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విష కీటకాలు, సర్పాలకు నిలయంగా మారాయి. ఈక్రమంలో దోమలు సైతం విజృంభిస్తున్నారు. అయితే ఇక్కడ ఫ్యాన్‌లు తిరగకపోవడంతో పాటు కిటికీలకు దొమ తెరలు లేకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు దోమల బెడదతో సతమతమవుతున్నారు. పిట్లం మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరింది. స్లాబ్‌కు పెచ్చులూడాయి. దీంతో ఎప్పుడు పెచ్చులూడి మీద పడతాయో అని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు.

నిజామాబాద్ జిల్లా రెంజల్ ఎస్సీ బాలుర వసతి గృహం లో బాత్‌రూం డోర్లు తుప్పు పట్టాయి. బీసీ బాలికల వసతి గృహంలో సైతం తుప్పు పట్టిన ఇనుప డోర్లు ఉన్నాయి. మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. మోర్తాడ్ ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులే కూరగాయలు కట్టింగ్ చేస్తూ కనిపించారు. ఆరా తీయగా.. సిబ్బంది సరిగా రాకపోవడంతో వంటపనిలో విద్యార్థులు తలో చేయి వేయాల్సి వస్తుంది.







పెద్దకొడప్‌గల్‌లోని ఎస్సీ హాస్టల్ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు.. కిటికీలకు లేని జాలీలు.. పరిసరాల్లో అపరిశుభ్రత



నిజామాబాద్ బీసీ హాస్టల్‌లో ఊరుస్తున్న స్లాబ్

శిథిలావస్థకు చేరిన భవనాలు

ఏర్గట్ల మండల కేంద్రంలోని ఎస్సి బాలుర వసతి గృహంలో విద్యార్థులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాల నుండి ఎందరో విద్యార్థులు వచ్చి, మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదవుతూ.. వసతి గృహంలో ఉంటున్నారు. ప్రస్తుతం ఇందులో మొత్తం 77 మంది విద్యార్థులున్నారు. వసతి గృహంలోని ఒకటవ, ఐదవ నెంబర్ గల గదుల్లో మొత్తం పెచ్చులూడి, ఓ వైపు కుంగి పోయింది. జోరు వర్షం కురిసినప్పుడు పై కప్పు నుండి నీరు కారి,గదులన్ని నీటిమయమై, విద్యార్థులకు నిద్ర అనేదే ఉండదని తెలిపారు. పై కప్పు ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. విద్యార్థులు బెడ్ లపై నిద్రించి కిందకి దిగే క్రమంలో... అనేక సందర్భాల్లో ఫ్యాన్లు తలకు తగిలి ఎన్నోసార్లు తలకు గాయాలయ్యాయని తెలిపారు. ఇదిలా ఉంటే స్నానాల గదుల్లో నీరు రాకపోవడంతో విద్యార్థులందరూ సామూహికంగా ఆరుబయటే స్నానాలు ఆచరిస్తున్నారు.

గత వారం పదిరోజుల నుండి ఒక్కరే వంట మనిషి ఉండడం వల్ల మెనూ ప్రకారం భోజనం అందించకపోగా, ఉడికి ఉడకని అన్నం పెడుతున్నారని విద్యార్థులు అంటున్నారు. ఇద్దరు వంట మనుషుల్లో భీంరావ్ అనే అతను సెలవుపై ఇంటికి వెళ్లగా,ప్రస్తుతం వారం రోజుల నుండి సత్యనారాయణ అనే వంట మనిషి విధులు నిర్వర్తిస్తున్నారు. నారాయణ మద్యం తాగి కిందపడిపోయి, దెబ్బలు తాకడంతో, హాస్టల్ లోని ఓ గదిలో పడుకుని ఉండిపోయాడు. ప్రస్తుతం అతని భార్య గత వారం రోజుల నుండి విద్యార్థులకు వంట చేస్తోంది. వండిన ఆహారం విద్యార్థులకు రుచించకపోవడంతో అన్నం మొత్తం.. ఉపయోగించని బాత్రూంలలో పడవేయడంతో ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతుంది. ఇంచార్జ్ హాస్టల్ వార్డెన్ తన ఇంటి సమస్యతో సెలవుపై వెళ్ళడంతో, విద్యార్థులకు ఇంకా ఇబ్బందిగా మారింది. విద్యార్థులు మాట్లాడుతూ.. మా సమస్యలకు పరిష్కారం చూపాలని, వారి ఆవేదన వెళ్ళగక్కారు.

కోతుల బెడద

ఇదిలా ఉంటే ఏర్గట్ల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూర్బా భవనానికి కాంపౌండ్ వాల్ నిర్మించలేదు. పాఠశాల నిర్మించిన సమయంలో లోపలి భాగంలో మట్టి నింపకపోవడంతో లోతు ఎక్కువగా ఉండడంతో, విద్యార్థులు అదుపు తప్పి అందులో పడే ప్రమాదం ఉందని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊరికి దూరంగా పాఠశాల ఉండడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయినిలకు, అందులో పనిచేసే వారికి కోతుల బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. అదే విధంగా బాల్కొండలోని బీసీ బాలికల వసతిగృహంలో సైతం కోతుల బెడద రోజురోజుకూ తీవ్రతరం అవుతుంది. కోతులు హాస్టల్ పరిసరాల్లో సంచరిస్తూ విద్యార్థినులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే కోతుల బెడద తప్పుతుందని అన్నారు.

సొంత భవనాలు లేక ఇక్కట్లు

బోధన్ పట్టణంలో సాంఘిక సంక్షేమ హాస్టల్లో సొంత భవనం లేక విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ఎస్సీ హాస్టల్ పాఠశాల గదలలోని ఏళ్ల నుండి కొనసాగుతుంది. ఈ హాస్టల్లో 110 మంది విద్యార్థులు ఉన్నారు. మూడో తరగతి నుండి పదవ తరగతి వరకు ఈ హాస్టల్ లో అడ్మిషన్లు కల్పిస్తారని వార్డెన్ విఠల్ తెలిపారు. దాని సమీపంలోనే బెగ్గర్ హాస్టల్ ఉంది. ఈ హాస్టళ్లకు ప్రహరీ గోడ కూడా లేకపోవడంతో పశువుల సంచారం అధికంగా ఉంది. పశువుల సంచారంతో సిబ్బంది, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవనాలు ఉన్న ఈ హాస్టల్లకు ప్రహరీ గోడ లేకపోవడంతో నిత్యం పశువుల సంచారంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కన గల ఎస్టి బాయ్స్ హాస్టల్ ప్రైవేట్ భవనంలో కొనసాగుతుంది. అది కూడా నాలుగవ అంతస్తులో హాస్టల్ ఉండడంతో విద్యార్థులు వారి అవసరాల కోసం దిగడానికి ఎక్కడానికి ఆయాస పడుతున్నారు. ప్రైవేట్ భవనంలో నాలుగో అంతస్తుల గల ఈ హాస్టల్ కు కనీసం ఆటస్థలం లేదు, డైనింగ్ హాల్ లేదు. అయినా విద్యార్థులు ఇబ్బందులు పడుతూ చదువుతున్నారు.

నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడలోని బీసీ బాలుర హాస్టల్‌లో వర్షం పడ్డప్రతిసారి స్లాబ్‌నుంచి ఊరుస్తుంది. మరమ్మతులు చేయించినా ఊరుస్తున్నట్టు విద్యార్థులు వాపోతున్నారు. 100 మంది విద్యార్థులకు 4 బాత్‌రూంలు ఉన్నాయి.

విద్యార్థుల ఇక్కట్లు తీర్చాలి

– ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరుణ్

వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. అనేక హాస్టళ్లల్లో సమస్యలు ఉండటంతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. విద్య, వైద్యం తొలి ప్రాధాన్యతగా చెప్పుకుంటున్న ప్రభుత్వం హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి. ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలను మెరుగుపరచకపోతే సౌకర్యాలు మెరుగుపడేంతవరకు ఎస్ఎఫ్ఐ విద్యార్థుల కోసం ఉద్యమం చేపడతాం.

మరమ్మతుల ప్రతిపాదనలు పంపండి

కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో అవసరమైన అత్యవసర మరమ్మత్తులు ఉంటే సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బి.సి.సంక్షేమ అధికారులు, పంచాయతీ రాజ్, ఈ.డబ్లు.ఐ.డి.సి, సంబంధిత ప్రిన్సిపల్స్, వసతి గృహాలు సంక్షేమ అధికారులు, కే.జి.బి.వి. ప్రిన్సిపాల్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలో అత్యవసర మరమ్మత్తులు చేపట్టవలసివస్తే అట్టి పనులకు ప్రతిపాదనలతో నేరుగా తనను కలవాలని అన్నారు. అలాగే తాగునీరు సమస్య ఉత్పన్నం అయినపుడు వెంటనే సమస్యను పరిష్కరించే దిశగా ప్రతిపాదించాలనీ సూచించారు. వసతి గృహాల్లో గాని, పాఠశాలల్లో గాని సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత సీనియర్ అధికారికి వివరించాలని, సమస్య పరిష్కరించే విధంగా చూడాలని అన్నారు. ఇట్టి పనులలో నిర్లక్ష్యం వహించిన అధికారుల పై చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సి.ఈ. ఓ. చందర్ నాయక్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిణి రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఈ. డబ్ల్యూ. ఐ.సి. ఇంజనీరింగ్ అధికారులు, ప్రిన్సిపాల్స్ , వసతి గృహాల సంక్షేమ అధికారులు, పాల్గొన్నారు







ఏర్గట్లలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో పెచ్చులూడిన స్లాబ్.. చెత్తతో నిండిన నిరుపయోగంలో ఉన్న బాత్‌రూం.. బాల్కొండలో కోతుల బెడద



పెద్దకొడప్‌గల్‌లో చిత్తడిగామారిన హాస్టల్ పరిసరాలు



పిట్లంలో పెచ్చులూడిన ఎస్టీ బాలూర హాస్టల్



మాక్లూర్‌లో క్రీడా ప్రాంగణంలో నిలిచిన నీటితో బురదమయం

బోనస్‌తో పంటలు కొనాలి

- రుణమాఫీ రైతులందరికీ వర్తింపజేయాలి
- రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్(కమ్మర్‌పల్లి)



మాట్లాడుతున్న వేముల

కేంద్ర ప్రభుత్వం నిర్ణయయించిన ఎమ్మెస్పీ ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కజొన్న, సోయాబీన్, వరి పంటలను కొనుగోలు చేయాలని రాష్ట్ర మాజీ, మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆనాటి పిసిసి అధ్యక్షులు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే క్వింటాలుకు రూ.500 అదనంగా ఇచ్చి, పంట కొనుగోలు చేస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్ లో చెప్పి మానిఫెస్టో లో పెట్టారన్నారు. శుక్రవారం వేల్పూర్ మండల కేంద్రంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన ఐదు అంశాలపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

రైతులు ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మొత్తంలో మొక్కజొన్న పండించారని, ప్రస్తుతం పంట చేతికొచ్చిందన్నారు.ప్రవేట్ వ్యాపారులు మొదట్లో క్వింటాలుకు రూ.2600 లకు కొనుగోలు చేశారని, కానీ ప్రస్తుతం రూ.2200 నుండి రూ.2300 లకు మాత్రమే కొంటున్నారన్నారు. ఎమ్మెస్పీ ధర రూ.2225 ఉన్నదని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 బోనస్ తో కలిపితే రూ.2725 కు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సోయాబీన్ పంటకు ఎమ్మెస్పీ ధర రూ.4892 ఉందని, ప్రభుత్వం రూ.500 బోనస్ ఇచ్చి రూ.5392 కు కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం రూ.4300 మాత్రమే ఇచ్చి ప్రవేట్ వ్యాపారులు రైతుల దగ్గర కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. క్వింటాలుకు రైతులు రూ.1100 నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంటకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మెస్పీ ధర రూ.2300 ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి క్వింటాలుకు రూ.2800 ఇచ్చి పంట కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయాలని, రుణమాఫీ అమలు కాకా రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు 3,79,000 రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా కేవలం 1,75,000 రైతులకు మాఫీ అయ్యిందని, ఇంకా 2లక్షల 4వేల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందన్నారు. బిఆర్ఎస్ పార్టీ పక్షాన రైతు పోరు బాట, నిరసన దీక్ష చేసామన్నారు.

విషజ్వరాలు, చికెన్ గున్యా, డెంగ్యూ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ప్రజలు వ్యాధులతో, జ్వరాలతో, కీళ్ల నొప్పులతో బాధపడుతుంటే చోద్యం చూస్తోందన్నారు. హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు, చికెన్ గున్యా లాంటి వాటికి మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

అంకితభావం, నిజాయితీ.. కొండా లక్ష్మణ్ బాపూజీ

- జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్, మేయర్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తుది శ్వాస వరకు అంకితభావం, నిజాయితీగా కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. కేవలం తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారని, చట్టసభల్లో గళమెత్తి తన పదవులను తృణప్రాయంగా వదులుకున్న త్యాగశీలి అని గుర్తు చేశారు. తెలంగాణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109 జయంతి వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి ఉత్సవాలు జరిపారు. అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూ కిరణ్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బీ.సి, పద్మశాలి కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు వినాయకనగర్ లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆయన త్యాగాలు, పోరాట పటిమను నేటి తరానికి తెలియజేసేలా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రమేష్, సహాయ అభివృద్ధి అధికారి నర్సయ్య, పద్మశాలి, బీసీ కుల సంఘాల నాయకులు పులగం హనుమాండ్లు, బిజ్జు దత్తాద్రి, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వెంకట నర్సయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మురళి, పద్మశాలి ఆత్మీయ సమితి అధ్యక్షుడు గురుచరణం, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు చంద్రభాగ, పి.నర్సయ్య, సామాజిక కార్యకర్త బంగారు సాయిలు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు మెట్ల బావి నిర్వహణ బాధ్యత

- భవిష్యత్తు తరాలకు ప్రాచీన కట్టడాలు చూపాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాగ్వాన్

నవతెలంగాణ-లింగంపేట్



మహిళా సంఘాల వంటకాలు పరిశీలిస్తున్న కలెక్టర్

లింగన్నపేట్ గ్రామాన్ని ఆదర్శవంతంగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మెట్ల బావి నిర్వహణ మహిళా సంఘాలదే అని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని, వారి వారి పిల్లల భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. శుక్రవారం లింగంపేట్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గల నాగన్న గారి మెట్ల బావి వద్ద ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లింగంపేట్ లోని నాగన్న బావి వలన పర్యాటక ప్రాంతంగా పరిగణించుకోవచ్చని అన్నారు. భవిష్యత్తు తరాల వారికి నాటి కట్టడాలను చూపించ వచ్చని తెలిపారు. ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి పరచడానికి స్థానిక. మహిళా సంఘాల వారు బాధ్యతగా నిర్వహణ చేయవచ్చని సూచించారు. లింగంపేట్ ప్రాచీన కట్టడాలకు నిలయమన్నారు. గ్రామంలోని రామాలయంలో ప్రాచీన కట్టడాలను వెలికితీయడానికి పునర్నిర్మాణం చేపట్టడానికి అందరు ముందుకు రావాలని ఆయన సూచించారు. రామాలయ సమీపంలో చారిత్రక కట్టడమైన మెట్ల బావి మట్టితో పేరుకుపోయిందని పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.

పర్యాటక కేంద్ర ప్రదేశాలలో రెస్టారెంట్లు హోటల్ వంటివి ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలను కలెక్టర్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రభాకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పరిషత్ సి.ఈ. ఒ. చందర్ నాయక్ ఎంపీడీవో నరేష్ ఎమ్మార్వో నరేందర్ ఏపీఎం శ్రీనివాస్ ఎంపీ ఓ మళహరి విద్యార్థి అధికారి సౌకత్ అలీ మండల సమైక్య అధ్యక్షురాలు సులోచన మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినీ తారల సందడి





అభిమానులతో మాట్లాడుతున్న పాయల్ రాజ్‌పుత్.. రామ్ అభివాదం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో సినీ తారలు సందడి చేశారు. నగరంలోని పులాంగ్‌చౌరస్తా సమీపంలో నిర్మించిన సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి హాజరై అభిమానులను అలరించారు. ముందుగా ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, నగర మేయర్ దండు నితు కిరణ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ బ్రాండ్ అంబాసిడర్ సినీ నటుడు రామ్ పోతినేని, అలాగే సినీ నటి పాయల్ రాజ్ పుత్ నటులు హాజరై అభిమానులను పలకరించారు. ఈ సందర్భంగా పలువురు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

అంకాపూర్‌లో రైతులకు రైతు విజ్ఞాన యాత్ర

నవతెలంగాణ-ఆర్మూర్



పసుపు క్షేత్రంలో రైతులు, శాస్త్రవేత్తలు

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నాబార్డ్ వరంగల్‌కు చెందిన 50 మంది రైతులకు శనివారం రైతు విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పసుపు పంట సాగు విధానం, పంట దిగుబడి పెరుగుదలను తెలుసుకున్నారు. పసుపులో మొక్కజొన్న వేసేటప్పుడు మొక్క జొన్నలో విత్తన దిగుబడి పసుపునకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని తెలుసుకున్నారు. ఖరీఫ్ లో సోయచిక్కుడు పంట సాగు చేసి, రబీలో మొక్కజొన్న పంటను సాగు చేసినప్పుడు నేల ఆరోగ్యం దెబ్బతినకుండా మొక్కజొన్న పంట దిగుబడి పెరుగుతుందని, రబీలో ఎర్రజొన్న సాగు చేస్తూ ప్రాసెసింగ్ చేపట్టి అధిక దిగుబడితో పాటు అధిక లాభాలను పొందటాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురడి రైతు సంఘం అధ్యక్షులు అనంత్ ,కార్యదర్శులు నారాయణరెడ్డి, బాజన్న ,నర్సారెడ్డి, వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రాములు, గ్రామ వ్యవసాయ విస్తీర్ణధికారి అధికారి సవిత, గ్రామ రైతులు 60 మంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి

• నగర సిఐ శ్రీనివాస్ రాజ్



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని రెండు, మూడు, నాలుగు, పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేస్తానని నిజామాబాద్ నగర సిఐ శ్రీనివాస్ రాజ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని నాలుగవ పోలీస్ స్టేషన్ ఆవరణలో గల సిఐ కార్యాలయంలో నగర సిఐ గా బాధ్యతలను శ్రీనివాస్ రాజ్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొంగతనాలు, చైన్స్ మ్యాచింగ్, జరగకుండా చర్యలు చేపడతామన్నారు. రానున్న దసరా పండగ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంటికి తాళాలు వేసి వెళ్లే ముందు స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలన్నారు.

భవిష్యత్తు తీర్చి దిద్దుకోవడానికి క్రీడలు దోహదపడతాయి

• ఎంఆర్‌ఓ రవీందర్ రావు

నవతెలంగాణ-సిరికొండ



మాట్లాడుతున్న ఎంఆర్‌ఓ రవీందర్ రావు

భవిష్యత్తు తీర్చి దిద్దుకోవడానికి క్రీడలు ఎంతో దోహద పడతాయని తహసిల్దార్ రవీందర్ రావు అన్నారు. మండలంలోని న్యావనంది గ్రామంలో శుక్రవారం విద్యార్థులకు స్కౌట్ దుస్తుల పంపిణీ చేశారు. కాంగ్రెస్ యువజన నాయకుడు ఉమాజి నరేష్ సొంత ఖర్చులతో పోడియం కట్టిస్తానని అన్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, యువకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ



నిజామాబాద్‌లో..



కమ్మర్‌పల్లిలో..



మెండోరాలో..



ఏర్గట్లలో..



ఆర్మూర్‌లో..

• ఘనంగా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

నవతెలంగాణ-విలేకరులు

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వరాష్ట్రం కోసం పరితపించిన తెలంగాణ వాది, మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలువురు పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్ గా, మంత్రిగా వివిధ హెూదాల్లో ప్రజలకు సేవ చేయడంతోపాటు నిరంతరం బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తపించారన్నారు. పదవులను కూడా తృణప్రాయంగా వదులుకున్న త్యాగధనుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలితరం ఉద్యమకారులు, రాజీలేని తెలంగాణ పోరాట యోధుడు, మూడు తరాల ఉద్యమ నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు.



బాల్కొండలో..



మోపాల్‌లో..



డిచ్‌పల్లిలో..

దక్షిణ ఇండియా మెదక్ అధ్యక్ష మండలం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

• స్త్రీల మైత్రి ఉత్సవాలకు తరలివెళ్లిన జక్రాన్‌పల్లి పాస్టరేట్



మాట్లాడుతున్న జక్రాన్‌పల్లి పాస్టర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

దక్షిణ ఇండియా మెదక్ అధ్యక్ష మండలం ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు స్త్రీల మైత్రి ఉత్సవాలకు మండలంలోని సిఎస్ఐ పాస్టరేట్ సంఘాలు మెదక్ జిల్లా కేంద్రంలోని మెదక్ మహా దేవాలయానికి తరలి వెళ్లినట్లు పాస్టర్ ప్రకాష్ శుక్రవారం తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ఏసుప్రభు మహాదేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ పాటలతో దేవుణ్ణి స్తుతించారు. ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని స్త్రీల మైత్రి ఆనందంతో కోలాటాలు, నృత్యం చేస్తూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పలు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో క్రిస్టియన్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

• బాధ్యతలు స్వీకరించిన ఒకటవ పోలీస్ స్టేషన్ సిఐ రఘుపతి



నవతెలంగాణ-కంఠేశ్వర్


శాంతిభద్రతలకు విఘాత కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శుక్రవారం ఒకటవ పోలీస్ స్టేషన్ సిఐగా బాధ్యతలు స్వీకరించిన రఘుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలోగల ప్రజలు తూచా తప్పకుండా పోలీస్ శాఖ నియమ నిబంధనలను పాటించాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఏదైనా సమస్యలు తలెత్తితే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాటకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కు కృషి చేస్తానన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

లేబర్ కోడ్‌ల రద్దు, పర్మినెంట్ కొలువుల కోసం చలో హైదరాబాద్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు, మూడు క్రిమినల్ చట్టాలరద్దుకోసం పంచాయతీ కార్మికుల పర్మినెంట్ కోసం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపడానికి ఈనెల 30 సెప్టెంబర్ చలోహైదరాబాద్ నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దాసు కార్మికులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో కార్మికుల విస్తృత సమావేశంలో దాసు పాల్గొని మాట్లాడారు. సఫాయి కార్మికులకు వేతనం పెంచి క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని అన్నారు. ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతీసే చట్టాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆటోవర్కర్స్ కు ఆదుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో మండల అధ్యక్ష కార్యదర్శులు సోప్పరి గంగాధర్, భానుచందర్, రాజన్న, సాయన్న, మల్లేష్, లక్ష్మి, మంతియా, గంగాధర్, గున్నావా, నాగమణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పాల్ పాఠశాలలో అవగాహన



మాట్లాడుతున్న అగ్ని మాపక అధికారి మధుసూదన్

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి సెయింట్ పాల్ హై స్కూల్ నందు శుక్రవారం అగ్ని మాపక అధికారి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించినారు.. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ముందస్తు జాగ్రత్తలపై విద్యార్థులకు డెమో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ బి కేథరిన్ పాల్, బబ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేధిస్తే షీటీంకు సమాచారం అందించాలి

నవతెలంగాణ-భీంగల్ రూరల్



అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

ఈవ్ టీజింగ్ చేస్తే షీ టీంకు సమాచారం ఇవ్వాలనీ, ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీటీం కానిస్టేబుళ్లు, విగ్నేష్, సుమతి అన్నారు. భుక్రవారం భీంగల్ పట్టణంలోని గవర్నమెంట్ కాలేజ్ క్రైమ్ గురించి విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిలు, ఉద్యోగినిలు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీ టీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కళాశాలకు వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు మార్గంమధ్యలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలపాలన్నారు. బాగా చదువుకుని ఉద్యోగాలను సాధించి స్ఫూర్తిదాయకంగా నిలవాలనివివరించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ఉరుమల్ల కృష్ణ దాస్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

టీయూ భూముల కబ్జా కుట్రలను నివారించాలి

• కుట్రదారులకు వత్తాసు పలుకుతున్న రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలి

• సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ భూముల కబ్జా కుట్రలను నివారించాలని, కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న తె.యూ రిజిస్ట్రార్ యాదగిరిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నగర కమిటీ నాయకులు అన్నారు. శుక్రవారం నగరంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్ లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ..574 ఎకరాల భూములను యూనివర్సిటీకి కేటాయించారన్నారు. ఈ భూముల్లో 54 ఎకరాలను మా సొంత భూములని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తప్పుడు రికార్డులతో భూమిని కాజేయాలని చూస్తే, అప్పటి మంత్రి సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ వరప్రసాద్ లు సీరియస్ గా స్పందించి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వత్తాసు పలికిన ఎమ్మార్వో రవికుమార్‌ను సస్పెండ్ చేశారన్నారు. ఈ భూములను దక్కించుకోవాలని రియల్ వ్యాపారులు కోర్టుకు వెళితే కోర్టు సైతం టీయూకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. దీనిపై వారు హైకోర్టుకు వెళ్లారన్నారు. హైకోర్టులో యూనివర్సిటీకి అనుకూలంగా అన్ని రికార్డులను అందించి అందుకు తగ్గ కృషి చేయాల్సిన ప్రస్తుత రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ముకాశారన్నారు. దాంతో ఈ 54 ఎకరాల టీయూ భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారుల పరమయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కేసులో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని యూనివర్సిటీ భూమిని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తున్న రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నాయకులు మురళి, సంధ్యారాణి, విటల్, గంగాధర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: తెలంగాణ యూనివర్సిటీ భూముల కబ్జా కుట్రలను నివారించాలని, కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడి ఎస్ యూ) పిడి ఎస్ యూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ తెలంగాణ యూనివర్సిటీ సెమినార్ హాల్ లో విలేకరుల సమావేశంలో పివైఎల్ జిల్లా డివిజన్ అధ్యక్షులు సాయిబాబా, పిడి ఎస్ యూ డిచ్పల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, రాజేష్, నాయకులు రాజేశ్వర్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-మోపాల్



మాట్లాడుతున్న డాక్టర్ సంతోష్

మండలం లోని బోర్గాం (పి) శివారులో గల సాయి గంగా వృద్ధాశ్రమంలో హెల్త్ డిపార్ట్‌మెంట్, ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో హెల్త్ నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్, ఐసిడిఎస్ సీడీపీఓ నందిని సూపెర్వైజర్ స్వరూప, అంగన్వాడీ టీచర్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై నిరంతర పోరు

• సీపీఐ(ఎం)

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) నాయకులు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్‌జికె శాఖ మహాసభ శుక్రవారం నిర్వహించారు. శాఖ కార్యదర్శి శ్రీదేవి జండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకటరాములు, జిల్లా కమిటీ సభ్యులు సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మూడు సంవత్సరాల కాలంలో సిపిఎం పార్టీ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, మట్కా, చీప్‌లిక్కర్, వ్యభిచారం వంటి వాటిపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. మంచినీరు, కరెంటు, ట్రాన్స్‌ఫార్మర్, వీధిలైట్లు, మురుగు కాలువల శుభ్రత, దోమల బెడద, మందుబాబులు మహిళలపై ఘర్షణకు దిగుతున్న వాటిపై ఆందోళనా కార్యక్రమాలు చేపట్టామన్నారు. రానున్న కాలంలో సమస్యలపై, పార్టీ ఇచ్చిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటామని సభ్యులు అన్నారు. కార్యక్రమంలో రాణి, కవిత, శాఖా సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిలోని కళా నైపుణ్యమూ విద్యనే

• అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవలకు ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ పాల్గొన్నా రు. మొదట ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు... భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయులు స్వామి వివేకానంద అని అన్నారు. విద్య అంటే చదువు ఒక్కటే కాదు వ్యక్తిలో ఉండే కళ నైపుణ్యాలను కూడా విద్యగా భావించాలన్నారు. అంతరించి పోతున్న కళలు జానపద గేయం, నృత్యాలు, కవిత్వం వంటి కళ, నైపుణ్యాలను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఈ యువజనోత్సవా విద్యార్థుల్లో ప్రతిభ, నైపుణ్యలను వెలికితీయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా యోవజన క్రీడా శాఖ అధికారి ముతన్న, డిస్టిక్ యూత్ ఆఫీసర్ శైలి , క్రీడాకారులు కళాకారులు,విద్యార్థులు,బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలి

• దొడ్డిదారిలో జరిగే నియామకాలను అడ్డుకోవాలి :పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గట్టు చప్పుడు కాకుండా అన్ని జిల్లాల్లో మున్సిపల్, ఇరిగేషన్ ,రెవెన్యూ తదితరుల శాఖలలో బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు జరుగుతున్నాయనీ, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ చేయాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పిడిఎస్‌యూ, పివైఎల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం దొడ్డిదారిన మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్ శాఖ, ఇతర శాఖలలో అక్రమ నియామకాలు జరిపారని , పేపర్ లీకేజీలు జరిగాయని, ఒక్కొక్క ఉద్యోగానికి లక్షల రూపాయలు చేతులు మారాయని అన్నారు. వాటిపై ఎంక్వయిరీ కమిటీలు కూడా వేశారు కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. గతంలో జరిగిన అక్రమ నియమాకాలను రద్దు చేయాలని, సక్రమంగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు జరగాలని డిమాండ్ చేశారు. జిల్లాల్లో దొడ్డిదారిన జరిగే నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని, నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయకపోతే నిరుద్యోగులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పివైఎల్ జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం, ఉపాధ్యక్షులు బండమీద నర్సయ్య పిడిఎస్‌యూ నాయకులు మనోజ్, రవీందర్, హన్మాండ్లు, సంతోష్, పివైఎల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

• సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా)

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) లో నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) నాయకులు అడిషనల్ పోలీస్ కమిషనర్ కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అవుతున్నట్టు పత్రికల్లో కథనాలు వచ్చాయన్నారు. జీజీహెచ్ ఆరోగ్యశ్రీ విభాగంలో ఉద్యోగుల నిర్లక్ష్యంతో సుమారు 10 కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ఆరోగ్యశ్రీ నిధులు జీజీహెచ్ కు రాకపోవడంతో ఎన్నో రకాల వైద్య సేవలు, పరికరాలు రోగులకు అందకుండా పోయాయన్నారు. బాధ్యులైన సిబ్బందిపై జీజీహెచ్ అధికారులు తీసుకున్న చర్యలు శూన్యమన్నారు. సరిపడా మందులు లేక, రోగులు ప్రైవేటు మెడికల్ షాపుల్లో మందులు కొనాల్సి వస్తుందన్నారు. రోగులకు, వారి అటెండర్‌కు నాసిరకం భోజనం పెడుతున్నారన్నారు. లక్షలాది రూపాయల నిధులు లెక్కల్లో చూపిస్తున్నా అవి రోగులకు అందడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలన్నారు. అడిషనల్ కమిషనర్ స్పందిస్తూ ఈ విషయంపై కమిషనర్ నేతృత్వంలో విచారణ జరుగుతుందని, తప్పకుండా చర్యలుంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గణేష్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా పాల్గొన్నారు.

ఐడీసీఎంఎస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయకును, డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి మండలంలోని కొలిప్యాక్, బ్రాహ్మణపల్లి సింగిల్ విండో చైర్మన్లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఇందూరు మార్కెటింగ్ సొసైటీ 56వ మహాజన సభ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఐడీసీఎంఎస్ చైర్మన్ తారచందునాయక్ నిడీసీసీబీ చైర్మన్ రమేశరెడ్డి ని శాలువాతో సన్మానించినట్లు కొలి ప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కొలిప్యాక సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ బ్రాహ్మణపల్లి సొసైటీ చైర్మన్ నర్సారెడ్డి పాల్గొన్నారు .

క్రీడా పరికరాల అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు క్రిభ్కో ఎరువుల సంస్థ తరఫున క్రీడాపరికరాలను అందజేశారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రిభ్కో ఎరువుల సంస్థ జిల్లా సేల్స్ ఆఫీసర్ లక్ష్మి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సంస్థ రూరల్ స్పోర్ట్స్ పోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు క్రీడా పరికరాలను అందజేశారు. నాలుగు వాలీబాల్స్, టెన్ని కాలైట్స్, స్కిప్పింగ్ రోప్స్, చెస్ బోర్డ్స్, లెగ్ కాప్స్, నెట్ తోపాటు డస్ట్ బిన్లను ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థులకు అందజేశారు. క్రీడ పరికరాలను అందించిన క్రిభ్కో ఎరువుల సంస్థ యాజమాన్యానికి పాఠశాల తరఫున ప్రజలు ఉపాధ్యాయులు కే. రాజన్న కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సోమ దశరథ్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.రాజన్న, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, సహకార సంఘం కార్యదర్శి శంకర్, ఉపాధ్యాయులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు శునకాలకు రేబీస్ వ్యాధి నివారణా టీకాలు

నవతెలంగాణ-ఏర్గట్ల/బాల్కొండ/ ముప్కాల్

ప్రపంచ రెబీస్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న శనివారం మండల పశువైద్యశాలలో పెంపుడు శునకాలకు ఉచిత రేబీస్ వ్యాధి నివారణ టీకాలు ఇవ్వడం జరుగుతుందని మండల పశువైద్యాధికారిణి రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ అవకాశాన్ని యజమానులు ఉపయోగించుకోవాలని కోరారు.

ముప్కాల్/ బాల్కొండ: రేబిస్ వ్యాధి నివారణ కోసం పశు వైద్య, పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ఉచిత రాబీస్ వాక్సినేషన్ శనివారం మండల కేంద్రంలోని వెటర్నరీ హాస్పిటల్లో నిర్వహిస్తామని డాక్టర్ గౌతమ్ రాజ్ పేర్కొన్నారు.ఉమ్మడి బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లోని అన్ని గ్రామాల్లోని పెంపుడు కుక్కలకు ఈ రాబీస్ వ్యాక్సిన్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ - భీంగల్ రూరల్

మండలం లోని బడాభీంగల్ గ్రామానికి చెందిన దేవి జ్యోతి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చేరారు. ఆగ్రామ నాయకులు, కార్యకర్తల ద్వారా తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి లక్ష రూపాయల ఎల్ఓసి ని అందించారు.

కొండా లక్ష్మణ్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కొండ లక్ష్మణ్ బాబూజీ 109వ జయంతి సందర్భంగా నిర్మాణానికి మండలకేంద్రంలో శుక్రవారం భూమి పూజ చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు, డిచ్‌పల్లి మాజీ ఎంపీపీ గద్దె భూమ్మన్న హాజరై మాట్లాడారు. తెలంగాణ స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ వచ్చేదాకా మంత్రి పదవికి రాజీనామా చేసిన మహనీయుడు బాపూజీ అని కొనియాడారు. కార్యక్రమంలో పెద్ద సంఘం భక్త మార్కండేయ, సంఘం మండల అధ్యక్షులు శ్రీపతి శేఖర్, జగదీష్ ,ప్రసాద్, శ్రీనివాస్, వినోద్, నర్సారెడ్డి, బాలకిషన్, గంగారెడ్డి, సతీష్, జితేందర్ నాయక్, విడిసి సభ్యులు, రమేష్ శ్రీనివాస్, శ్యామ్, సత్యనారాయణ, ఆనంద్ పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ఎంపీకి వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎంఎస్ఆర్‌యు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసు రాజు కార్యదర్శి లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ఎంపీ ధర్మపురి అరవింద్ కు కలిసి వినతి పత్రం అందజేశారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌లకు చట్టబద్ధమైన పని నియమాలు, 2017లో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీని అమలు చేసి కార్మికుల ను ఉద్యోగము నుండి టర్మినేట్ చేయడం ద్వారా దూర ప్రాంతాలకు బదిలీలు చెయ్యడం బేషరతుగా ఆపాలని కోరారు. కార్యక్రమంలో టిఎంఎస్ఆర్‌యు నాయకులు, సభ్యులు ఆర్ శ్రీనివాస్, సంపత్, సంతోష్, గంగామోహన్, శ్రీకాంత్, నరేందర్, సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విజయ్ విద్యార్థులు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగా పోటీలు యోగాభవన్, కామారెడ్డిలో ఈనెల 26న నిర్వహించారు. ఈ పోటీల్లో విజయ్ హైస్కూల్లో 6వ తరగతి చదువుతోన్న బి.సాయితేజ, 9వ తరగతి చదువుతోన్న జునేరా హుసేన్లు జిల్లాస్థాయి యోగాపోటీలలో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. స్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత విద్యార్థులను అభినందించారు.

బస్సులను తరుచూ పరిశీలించాలి

నవతెలంగాణ-సదాశివనగర్

బస్సులను తరుచుగా పరిశీలించుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.మహేశ్ తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని స్కూల్ బస్సుల మెయింటెనెన్స్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల బస్సులను తరచూ పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు తగిన మరమ్మతులు చేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బస్సులను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ కె. మహేశ్

పెరటి కోళ్ల యూనిట్ ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండలంలోని జువ్వాడి గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మి అనే సభ్యురాలికి పెరటి కోళ్ల మదర్ యూనిట్లో భాగంగా నాటు కోడి పిల్లల పెంపకం కేంద్రాన్ని మండల ప్రజా పరిషత్ అధికారి రాజేశ్వర్ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. నాటుకోడి పిల్లలు స్వయం సహాయక సభ్యులకు పంపిణీ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీనారాయణ, ఏపిఎం గంగరాజు, సీసీలు, వీవోఏలు, స్వయం సహాయక సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.


కోళ్ల పెంపకం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారి

స్వచ్ఛమైన నీటిని అందించాలి

- డీఎల్పీఓ మధుకర్
- మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ

నవతెలంగాణ-రెంజల్

గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని డీఎల్పిఓ మధుకర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతి గ్రామంలో పనిచేసే వాటర్ మెన్‌లు స్వచ్ఛమైన నీటిని ప్రజలకు ఎలా అందించాలో అనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్వకాలంలో చెలి మెలు, బావుల ద్వారా నీటిని వాడుకునే వారని, ప్రస్తుతం చేతిపంపులతోపాటు, బోరు బావుల ద్వారా నీటిని అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నీటిలో స్వచ్ఛమైన నీటిని గుర్తించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి వివరించారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ట్యాంకులను శుభ్రం చేయడంపై సమగ్రంగా అవగాహన కల్పించారు. పైప్‌లైన్ల మరమ్మతులు, విద్యుత్తు పనులు ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. ఈ శిక్షణ తరగతులలో అవగాహన అనంతరం వారికి పరీక్ష నిర్వహించారు. వాటర్‌మెన్‌లకు వారి మార్కులను బట్టి ప్రశంసపత్రాలను అందజేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్ యాదవ్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ ముని నాయక్, సూపరింటెండెంట్ హెచ్.శ్రీనివాస్, ఎంపీఓ రఫీ అహ్మద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్‌సింగ్, ఎడపల్లి, రెంజల్, మండలంలోని వాటర్‌మెన్‌లు, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్పిఓ మధుకర్

నసురుల్లాబాద్ ఎంఈవోకు సన్మానం


ఎంఈవోను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నసురుల్లాబాద్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చందర్ మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించడంతో శుక్రవారం నసురుల్లాబాద్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. మండల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందు పటేల్, మాజీ సర్పంచ్ అరిగే సాయిలు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు గునిగేరి హన్మండ్లు, సీనియర్ నాయకులు యూసుఫ్, శాంతయ్య, లింగం, నరేశ్ పటేల్, తదతరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని పేపర్‌మిల్లు గ్రామానికి చెందిన ముఖిమ్ ఖాన్ చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.12 వేల చెక్కు రావడంతో బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేసినట్టు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉబేద్ అలీ, సద్దాం ఖాన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అబ్బల్ ఖాన్, బాబా ఖాన్, కుర్షిత్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి ఎంఈఓ సాయిలుకు సన్మానం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఆంగ్ల తెలుగు, మధ్యమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న సాయిలు ఎడపల్లి మండల విద్యాశాఖ అధికారిగా పదోన్నతి రావడంతో ఆయన ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను పలువురు ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని నెహ్రూనగర్, పోచారం, ఏఆర్‌పి క్యాంప్, అంబం(వై) గ్రామాలలోని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు భారత ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కందగట్ల రామ్‌చందర్ దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు ఉచిత సేవ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఎడపల్లి, జానకంపేట, మంగళ్‌పాడ్, కుర్నాపల్లి, ఠానాకాలన్, నెహ్రూనగర్, అంబం(వై) గ్రామాలలోని పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి దుస్తులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మల్లెపూల శ్రీనివాస్, కంటెడి గంగాధర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో శనగ విత్తనాలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని రైతులకు శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రాథమిక సహకార సంఘాలలో ఉన్నట్లు పేర్కొన్నారు. సదాశివనగర్‌లో 400, అడ్లూర్ ఎల్లారెడ్డిలో 100, పద్మాజివాడి 300, ఉత్నూర్ 200 బస్తాలు ఉన్నట్లు సూచించారు. 25 కిలోల బస్తాకు రూ.2250 ధర ఉన్నట్లు తెలిపారు. ఈ విత్తనాలకు సబ్సిడీ లేదని పేర్కొన్నారు.

మద్నూర్‌లో తిరుపతి జెండా వద్ద మహా అన్నదానం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రానికి వారం రోజుల క్రితం చేరుకున్న తిరుపతి జెండా వద్ద శుక్రవారం తిరుపతి జెండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం తిరుపతి జెండా మహారాష్ట్ర నుంచి మద్నూర్ చేరుకుంటుంది. ఇక్కడి నుంచి మద్నూర్ మండలంలోని కొడిచర గ్రామానికి వెళ్తుంది. మద్నూర్ మండల కేంద్రంలో 11 రోజులపాటు గాంధీచౌక్ ఆవరణలో స్థాపించబడిన తర్వాత ప్రత్యేక పూజలు అనంతరం ఇక్కడి నుండి కొడిచర గ్రామానికి ఆదివారం వెళ్లనుంది.

పోచారంలో స్వచ్ఛతాహి సేవ


ప్లాస్టిక్ బాటిళ్లను తొలగిస్తున్న అధికారులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గల చెత్తాచెదారాన్ని తొలగించి స్వచ్ఛతాహి కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా పోచారం ప్రాజెక్టులో నీటి అలలకు కొట్టుకువచ్చిన ప్లాస్టిక్ బాటిల్స్‌ను అధికారులు తొలగించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీ ప్రసన్న, ఎంపీడీవో ప్రభాకర్ చారి, ఈసీ సాయిలు ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

రైతుల సహకారం కోసమే సంఘం

- మహాజనసభలో చైర్మన్ శ్రీనివాస్ పటేల్

నవతెలంగాణ-మద్నూర్

వ్యవసాయ రైతుల సహకారం కోసమే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఎల్లవేళలా పనిచేస్తుందని చైర్మన్ శ్రీనివాస్ పటేల్ తెలిపారు. రైతుకు కావలసిన ఎరువులు, విత్తనాలు మద్దతు ధర కొనుగోలు కేంద్రాలు సంఘం ద్వారా రైతులకు సకాలంలో అందించడానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని వివరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని 55వ మహాజనసభను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైతులు 2 లక్షల రుణమాఫీ గురించి డిమాండ్ చేశారు. అదేవిధంగా సోయా పంట కొనుగోలు కేంద్రం వెంటనే ప్రారంభించాలని, రబీ పంట సాగు కోసం శనగ విత్తనాలు దిగుమతి చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మహాజనసభలో సహకార సంఘంలో తీసుకున్న రుణాలు గురించి జమ ఖర్చుల గురించి కార్యదర్శి రైతులకు వివరించారు.

అడ్డుకట్ట వేసినా.. ఆగరే

- రెచ్చిపోతున్న ఇసుక అక్రమార్కులు

నవతెలంగాణ-పొతంగల్

మండలంలో ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. తరచూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ.. అడ్డుకట్ట వేస్తున్నారు. అయినా అక్రమార్కులు అంతటితో ఆగకుండా మండలంలోని ఏదో ఒక గ్రామంలోంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. పోతంగల్ గ్రామంలో సీజ్ చేసిన టిప్పర్, మైనింగ్ శాఖ అధికారులకు పంపగా.. రూ.50,000 జరిమానా విధించి దంపులను గుర్తించి, స్వాధీనం చేసుకుని వేలం వేశారు. అయినప్పటికీ గురువారం రాత్రి, రెవెన్యూ సిబ్బంది ఇసుక అక్రమ రవాణా గురించి పెట్రోలింగ్ చేస్తుండగా.. భాకర్ ఫారం వద్ద ఇసుకతో నిండి ఉన్న ఒక టిప్పర్ గుర్తించి, సీజ్ చేసినట్టు తహసీల్దార్ జె.మల్లయ్య తెలిపారు. ఆ టిప్పర్‌ను పోలీస్ స్టేషన్ కోటగిరిలో ఉంచి తగిన చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులకు పంపించారని తెలిపారు.



అర్హులందరికీ త్వరలో రేషన్‌కార్డులు

- ఎడపల్లి డిప్యూటీ తహసీల్దార్ అనూష

నవతెలంగాణ-ఎడపల్లి

రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ త్వరలో రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని ఎడపల్లి డిప్యూటీ తహసీల్దార్ అనూష తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శంకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు అధికారులు సభలో ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండల విద్యాశాఖ అధికారి సాయిలు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో భోజనంతోపాటు, విద్య, అలాగే మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్ వైద్యాధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరిగిందని, కావలసిన మందులు అందుబాటులో ఉన్నట్లు వైద్యులు సాయిస్టాఫిర్డోస్, ఆయుష్ వైద్యాధికారి వెంకటేష్ తెలిపారు. అనంతరం పశువైద్య, ఇందిరా క్రాంతి పథకం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారులు మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్ నాయక్, మండల విద్యాశాఖ అధికారి సాయిలు, ఉపాధి హామీ మండల ఏపీవో శ్రీవాణి, ఐకెపి ఎపిఎం సాయిలు, ఆయా శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ అనూష

లాభాల బాటలో దూపల్లి సొసైటీ

- సింగిల్ విండో చైర్మన్ శేషుగారి భూమారెడ్డి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి సింగిల్ విండో సొసైటీ లాభాల బాటలో కొనసాగుతోందని దూపల్లి సొసైటీ చైర్మన్ శేషు గారి భూమారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సొసైటీ కార్యాలయం ఆవరణలో మహాజన సభ ను అధ్యక్షులు భూమారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘ సభ్యుల సహాయ సహకారాలతో సొసైటీని నడిపిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సొసైటీ నూతన భవన నిర్మాణానికి ఓమిని కొనుగోలు చేశామని, రూ.27లక్షలు నగదుగా ఉన్నాయని, మరో ఎనిమిది లక్షల రూపాయలు ఫర్టిలైజర్ మందులు ఉన్నాయన్నారు. సొసైటీకి మరో రూ.37 లక్షలు వచ్చేది ఉందన్నారు. సొసైటీ లాభాల బాటలో నడిపించే విధంగా సంఘ సభ్యులందరూ వచ్చే సీజన్లో ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని సేకరించవలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పల్లె సాయిలు, ధనుర్ గంగాధర్, కూనేపల్లి రాజారెడ్డి, జి.ప్రతాపరెడ్డి, కాశం సాయిలు, సి.రామ్‌రెడ్డి, సాయమ్మ, మైని రాజకుమార్, ముళ్ళపూడి వరలక్ష్మి, గైనిగోపాల్ గంగారం, కార్యదర్శి జీవన్‌రెడ్డి, రైతులు గోపాల్‌రెడ్డి, బాబన్న, నారాయణరెడ్డి, గంగారెడ్డి, గంగరాజు, పోశెట్టి, సిబ్బంది లక్ష్మణ్, సాయన్న, ప్రతాప్‌రెడ్డి, వై.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ శేషుగారి భూమారెడ్డి

మల్టీ పర్పస్ పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-మద్నూర్

స్వచ్ఛ తాహి సేవ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ పారిశుధ్య కార్మికులకు మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి నాగరాజు మాట్లాడుతూ.. మల్టీపర్పస్ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాల పట్ల ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో భాగంగా మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. డివిజనల్ పరిధిలో మల్టీపర్పస్ కార్మికులందరికీ మూడు రకాల ఆరోగ్య బీమా అమలు కోసం కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులంతా గ్రామాల్లో సమయపాలన పాటించి శుభ్రత పనులు సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని కార్మికులకు రావలసిన బకాయిల గురించి నివేదికలు తీసుకొని వారికి ఒకటి రెండు రోజుల్లో జీతాలు పంపిణీ చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామ శుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని గ్రామ కార్యదర్శి సందీప్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. డాక్టర్ నాగార్జున్, మల్టీపర్పస్ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో రాణి, ఎంపీఓ వెంకట నరసయ్య, పంచాయతీ కార్యదర్శి సందీప్ కుమార్, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ దివ్య

నవతెలంగాణ-భిక్కనూర్

గర్భిణులు వైద్యుల సూచనలు సలహాలు పాటిస్తూ జాగ్రత్తలు పాటించాలని మెడికల్ ఆఫీసర్ దివ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని కాచాపూర్ గ్రామంలో పోషణ మాసం కార్యక్రమాన్ని అంగన్వాడీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులకు డెలివరీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ఏ విధంగా తీసుకోవాలో సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శోభ, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులున్నారు.

గ్రామాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం..

మండలంలోని కాచాపూర్, పెద్దమల్లారెడ్డి, ఆయా గ్రామాలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాలలో ఇంటి పరిసరాలలో నీటి నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి నీళ్ల నిలువ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారి దివ్య, హెచ్ఈఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఆరోగ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వరి పంటలు పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-బిచ్కుంద

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం క్షేత్ర ప్రదర్శనలో భాగంగా ఏరువాక కేంద్రం మాల్‌తుమ్మెద వ్యవసాయ శాస్త్రవేత్తలు అనిల్‌రెడ్డి, రేవంత్ వరి పంటలను శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా బిచ్కుంద మండలంలోని బండ రేంజల్ గ్రామంలోని వ్యవసాయ వరి పంటలను వారు పరిశీలించి వరికి ఆకు ఎండు తెగులు ఆశించిన రైతులు వెంటనే ప్లాంటోమైసిన్ నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. యూరియా వాడకం తగ్గించి ఎకరానికి 15 నుంచి 20 కిలోల పొటాష్ ఎరువు వేసుకోవాలని రైతులకు సూచించారు. వారి వెంట వ్యవసాయ అధికారి రాజలింగం, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు దయానంద్, సాయి, కిషోర్, లక్ష్మణ్, భాను ప్రశాంత్‌రెడ్డి తదితరులున్నారు.

ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఎంఈఓలు


ఎంఈఓలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బోధన్

నూతనంగా ఎంఈఓగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన బోధన్ ఎంఈఓ నాగయ్య, సాలూర మండల ఎంఈఓ మంజూష, చందూర్ మండల ఎంఈఓ నాగనాథ్‌ను శుక్రవారం మండలంలోని ఉపాధ్యాయులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధన్ మండలంలో సుదీర్ఘ కాలం పాటు పని చేసిన నాగనాథ్ చందూర్ మండల ఎంఈఓగా బాధ్యతలు చేపడుతున్నారని ఆయనకు ఉపాధ్యాయ సంఘాల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బోధన్ మండల ఎంఈఓగా నాగయ్య సాలూర మండల ఎంఈఓగా రావడం అభినందనీయమని వారికి సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు నగేష్ బాబు, అత్తరుద్దీన్, సుధాకర్‌రెడ్డి, అబ్బయ్య, సీఆర్పిలు ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు


ఉపాధ్యాయులను సన్మానించిన హెచ్ఎం తదితరులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న మని, సంపత్, శ్రీవిద్య అనే ఉపాధ్యాయులకు శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తొమ్మిది సంవత్సరాలుగా మల్లూరు పాఠశాలలో తమ సేవలను అందించి ఎందరో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి తీర్చిదిద్దారన్నారు. వారు పనిచేసిన 9 సంవత్సరాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయం చేసుకుంటూ పాఠశాలకు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా వారు పనిచేశారని గుర్తు చేసుకున్నారు. వారు ఏ పాఠశాలకు వెళ్లినా అక్కడ పురోగతి సాధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిఆర్‌పిబి శ్రీధర్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్, మౌనిక పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శనివారం | సెప్టెంబర్ 28, 2024 | www.navatelangana.com

రైల్వే ట్రాక్‌ను పరిశీలించిన ఆర్పీఎఫ్, జిఆర్‌పిఎఫ్ పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నగర శివారులో మాధవనగర్ వద్ద రైల్వే ట్రాక్ను ఆర్పీఎఫ్, జీఆర్పీఎఫ్ పోలీసులు శుక్రవారం ఉదయం పరిశీలించారు. గేటు వద్ద గురువారం ఒక యువకుడు వీరంగం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గేట్‌మెన్‌పై దాడికి యత్నించడంతో పాటు ట్రాక్‌పై రాళ్లు పెట్టిడంతో అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం విచారణ చేపట్టారు. మొదట మాధవ్ నగర్‌లోని రైల్వే గేట్ ప్రాంతంలో గేట్ మెన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందించిన అనంతరం తీసుకునే చర్యలను వివరిస్తామని పేర్కొన్నారు.

వేంపల్లి విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన తేలు శ్రీనివాస్ కుమారులైన తేలు సాయిసృజన్, తేలు సాయి సృపాన్ హైదరాబాద్‌లోని హాకింపేట్ స్పోర్ట్స్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో వరంగల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపి రజతం, కాంస్య పతకాలు సాధించారు. అటు పాఠశాలకు, ఇటు గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తేవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రజత, కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులు

రుణమాఫీ రైతులకు మళ్లీ రుణాలు అందించాం

- దీర్ఘకాలిక రుణాలకు కొందరు రైతులు నోటీసులు ఇచ్చిన స్పందించడంలేదు
- సొసైటీ మహాజన సభలో చైర్మెన్ చెలిమెల మల్లికార్జున్

నవతెలంగాణ-ధర్పల్లి

రైతుల శ్రేయస్సు కొరకే ప్రభుత్వం సొసైటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు అందుబాటులో ఉంటూ సమయానికి వారికీ కావలసిన యూరియా, విత్తనాలు, ఇతరత్రా యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించడంతో పాటు వారికీ రుణాలు అందిస్తున్నామని సొసైటీ చైర్మెన్ చెలిమెల మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం సొసైటీ ఆవరణలో జరిగిన మహాజన సభకు అధ్యక్షతన వహించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను సమయానికి అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైతులకు రుణాలు ఇవ్వడంలేదని సభలో కొందరు రైతులు సభ దృష్టికి తేగా గతంలో కొందరు రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలను కట్టడం లేదని, వారికి ఉన్నత అధికారుల నుండి నోటీసులు అందించిన స్పందించడంలేదని అన్నారు. ఎంతటి వారైనా ప్రభుత్వ సొమ్మును ఎగ్గొట్టే ప్రశ్నే లేదని తప్పకుండ అధికారులు చర్యలు తీసుకుంటారని, సొసైటీ పరిధిలోని అనేక మంది వారు తీసుకున్న రుణాలకు ప్రభుత్వం ద్వారా ఇటీవల రుణమాఫీ జరిగిందని, వారికీ తిరిగి రుణాలు ఇచ్చామని తెలిపారు. ముందుగా కార్యదర్శి గుజ్జులా సంతోష్ రెడ్డి సంఘం యొక్క జమ ఖర్చుల వివరాలను చదివి వినిపించారు. కార్యక్రమములో ముఖ్యఅతిధిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గ్రామ మాజీ సర్పంచ్ మట్టపల్లి గంగారెడ్డి, డైరెక్టర్లు గున్నయ్య, సభావత్ శ్రీనివాస్ నాయక్, పుప్పాల మహేందర్, విట్టల్, సాలేహ బేగం, నౌసి, రమేష్, పోతరాజు. రఘు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మెన్

దొడ్డువడ్లకు సైతం రూ.500 బోనస్ ఇవ్వాలి

- మహాజనసభలో తీర్మానం

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజనసభను శుక్రవారం విండో చైర్మన్ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గత అర్థ సంవత్సర సహకార సంఘం లావాదేవీలను సహకార సంఘం కార్యదర్శి చదివి వినిపించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి దొడ్డు రకం వడ్లకు కూడా 500 రూపాయల బోనస్ ఇవ్వాలని తీర్మానం చేశారు. రైతులు పండించిన మొక్కజొన్న సోయా పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సభ్యులు కోరారు. లోన్ మాఫీ అయినా సభ్యులకు కొత్త వారికి రుణాలు ఇవ్వాలని తీర్మానం చేశారు. నూతనంగా కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన సహకార సంఘం డైరెక్టర్ భూత్ పురామ్ మైపాల్‌ను సంఘ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మోత్కు భూమన్న, సంఘం ఉపాధ్యక్షుడు నవీన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్

నీటి సహాయకులకు శిక్షణ

నవతెలంగాణ-బాల్కొండ/మాక్లూర్

మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో నీటి సహాయకులకు శిక్షణ తరగతులను శుక్రవారం అధికారులు ప్రారంభించారు. ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలో శుక్రవారం నుంచి 4 రోజుల పాటు మంచి నీటి సహాయకులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ తరగతులు కొనసాగుతాయని మిషన్ భగీరథ ఏఈ బస్వరాజ్ తెలిపారు. శుక్రవారం శిక్షణలో భాగంగా నీటి సహాయకులకు చేతి పంపులు రిపేర్, మోటార్ రిపేర్, ప్యానల్ బోర్డ్ రిపేర్, పైపులైన్‌ల రిపేర్లు, నీటి నాణ్యత ప్రమాణాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్డబ్ల్యూఎస్ అబ్దుల్ రజాక్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఎంపీఓ ఆర్.గంగామోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బస్వరాజు, బాల్కొండ గ్రామపంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, నీటి సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో..

మాక్లూర్ :వాటర్ మెన్‌లు మోటార్ పంపుల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని సిఇ రాంచదర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మొదటి రోజు మండలంలోని వివిధ గ్రామపంచాయతీ వాటర్ మెన్‌లకు విద్యుత్ పంపు సెట్లపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ మెన్ లకు వన్ ఎచ్ పి, త్రీ ఎచ్ పి మోటార్ పంపులను ఏవిధంగా అమర్చాలి.. జాగ్రత్తలను వివరించారు. అక్టోబర్ 1వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఇ రాకేష్, డీఇ గంగారాం, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఏఇ లు అనిల్, అన్వేష్, పంచాయతీ వాటర్ మెన్లు పాల్గొన్నారు.

వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచిన ఎస్ఐ అనిల్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలో జరుగుతున్న మండల అంతర్ పాఠశాలల క్రీడల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. ఉదయం వాలీబాల్ పోటీల ప్రారంభ సమయంలో మినీ స్టేడియానికి విచ్చేసిన కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి విద్యార్థులను ప్రోత్సహించేందుకు కొద్దిసేపు వారితో కలిసి వాలిబాల్ ఆడారు. ఎస్ఐ అనిల్ రెడ్డి షాట్ కొడుతుండగా విద్యార్థులు, యువత కేకలు, ఈలలతో సందడి చేశారు. అనంతరం క్రీడాకారులతో ముచ్చటించారు. విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో క్రీడల్లో పాల్గొనాలని, ఎలాంటి రాగద్వేషాలకు చోటు ఇవ్వద్దని క్రీడాకారులకు సూచించారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు.



వాలీబాల్ ఆడుతున్న ఎస్ఐ

ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల ఇన్చార్జి విద్యాధికారి గా మండలంలోని యానం పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కెఎల్ఎన్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సంధ్య నాయక్, సుశీల్, గంగారాం, ఆనంద్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, భాగ్యలక్ష్మి, వెంకట్రాం, అమర్సింగ్, గత విద్యాధికారి రాజా గంగారం తదితరులు పాల్గొన్నారు.

చింతలూరు విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ



క్రీడల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో ఈనెల 23, 24 మరియు 25 తేదీలలో జరిగిన మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడలలో చింతలూరు విద్యార్థులు జూనియర్ బాలికలు, సబ్ జూనియర్ బాలురు వాలీబాల్ విభాగంలో బహుమతిని సాధించారు మార్చి పాస్ట్ విభాగంలో ఉత్తమ ప్రదర్శనతో బహుమతి కైవసం చేసుకున్నారు. విద్యార్థుల అత్యుత్తమ ప్రదర్శనతో అద్భుత విజయాలు సాధించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విజయోత్సవ ర్యాలీని నిర్వహించి అనంతరం జడ్పిహెచ్ఎస్ చింతలూరు పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మాజీ సర్పంచ్ పుప్పాల సుకన్య హాజరయ్యారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, చైర్మన్ తిరుపతి రెడ్డి ఉపాధ్యాయులను మరియు ప్రధానోపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి, వారి కృషికి కృతజ్ఞతలు తెలిపారు. 20 సంవత్సరాల తర్వాత చింతలూరు పాఠశాలకు బహుమతులు రావడం ఆనందంగా ఉందని తిరుపతిరెడ్డి అన్నారు. మాజీ సర్పంచ్ సుకన్య మాట్లాడుతూ క్రీడల్లో కూడా ప్రతిభ చాటడంఉపాధ్యాయుల నిస్వార్థ శ్రమతో సాధ్యమైందని వ్యాఖ్యానించారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో మండల పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలను ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు పశు వైద్యులు ఉమామ సాహెర్, కిరణ్ దేశ్ పాండే శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు టీకాలు వేస్తున్నామని, పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలను రేబిస్ టీకాలు వేయించాలని పేర్కొన్నారు.

నేడు లోక్ ఆదాలత్

నవతెలంగాణ-మాక్లూర్

నేడు జరిగే లోక్ ఆదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని మండల పరిధిలోని ప్రజలకు ఎస్సై రాజశేఖర్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. పలు రకాల కేసులను పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకొని కేసులను క్లోజ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు స్థానిక పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని తెలియజేశారు.

ప్రజల గుండెల్లో నిలిచిన మహోన్నత వ్యక్తి డీఎస్

- ముగిసిన డీఎస్ స్మారక క్రీడా పోటీలు
- ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రదానం



సినీ హీరో ఆకాష్‌ను సన్మానిస్తున్న సంజయ్



మాట్లాడుతున్న సినీ హీరో ఆకాష్

నవతెలంగాణ కంఠేశ్వర్

చదువుతోపాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ఆకాష్ పూరీ జగన్నాత్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ అధ్యక్షులు ధర్మపురి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డి.ఎస్ స్మారక క్రీడా పోటీలు ఐదు రోజులపాటు కొనసాగగా శుక్రవారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ యువ హీరో పూరి ఆకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారుల కోరిక మేరకు ఓ సినిమా డైలాగ్‌తో అదరగొట్టారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకు న్నాయి. మ్యాజిక్ షో నిర్వహించారు. ధర్మపురి జయంతిని పురస్కరించు కొని కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ధర్మపురి సంజయ్ మాట్లాడుతూ.. ధర్మపురి శ్రీనివాస్ జిల్లా అభివృద్ధికి పాటుపడుతూ జిల్లా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. విద్య సాగర్ రెడ్డి, సాయిలు నాన్నగారికి చాలా ఆప్తులని, జిల్లాలో స్పోర్ట్స్ రంగానికి వీరిద్దరూ శ్రమ పడ్డారని అన్నారు. అప్ కమింగ్ హీరో వాళ్ళ నాన్న గురించి ఎంత చెప్పినా తక్కువేనని, పూరీ జగన్నాథ్ అబ్బాయి ఆకాష్ పూరి జగన్నాథ్ రావడం సంతోషమని అన్నారు.

అనంతరం క్రీడలలో క్రీడా విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం సినీ హీరో ఆకాష్ పూరితోపాటు కమిటీ సభ్యులందరినీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధర్మపురి సురేందర్, గౌతమ్, సాయిలు, పిఈటిల సంఘం అధ్యక్షులు విద్యాసాగర్, శోభ, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ ప్రజల మనిషి : ఎంపీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ధర్మపురి శ్రీనివాస్ ప్రజల మనిషి ప్రతి నిమిషం ప్రజలకోసం పరితపించేవారని నిజామాబాద్ ఎంపి అరవింద్ ధర్మపురి అన్నారు. మాజీ మంత్రి దివంగత నేత ధర్మపురి శ్రీనివాస్ జయంతి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ శుక్రవారం నగరంలోని బైపాస్ రోడ్డులో గల డిఎస్ సమాది వద్ద పూలమాలలు వేసి శ్రద్ధంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపి అరవింద్ మాట్లాడుతు... డిఎస్ తనకు తండ్రి మాత్రమే కాదని, రాజకీయ గురువు అని అన్నారు. ప్రజలకు ఆయన రాజకీయాలకతీతంగా సేవచేశారు అని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలో డిఎస్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. డిఎస్ జయంతి సంధర్భంగా నివాళ్లు అర్పించిన వారిలో ధర్మపురి అరవింద్ తో పాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, వ్యాపారవేత్త కాపర్తి శ్రవణ్ కుమార్, మాజీ జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీ నర్సయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లిఖార్జున్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, కోట పాటి నర్సింహనాయుడు, శంకర్, బంటు రాము ఉన్నారు.

పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా స్వచ్ఛత హి సేవ డే -10 లో భాగంగా నాగారంలోని ఫిఫ్త్ టౌన్ నుండి ఎస్ఐ వారి బృందం కళాశాల విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, మేనేజ్మెంట్ రూల్స్, సంచార్ సతి పోర్టల్ లో కంప్లైంట్ ఎలా చేయాలి అనే అంశాలపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐక్యూఎస్సీ కోఆర్డినేటర్ సీఎస్ డిపార్ట్మెంట్ అధ్యాపకురాలు సుష్మిత విద్యార్థులకు ఫోన్ వాడకం, వాట్సాప్ వాడకం, వెబ్సైట్‌ని ఎలా ఉపయోగించాలి అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ , వైస్ ప్రిన్సిపల్ జి . భార్గవి.ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ వి. జి లక్ష్మి అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు. ఇంకా చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమము నిర్వహించినట్లు ఎంపిడిఓ బాలకృష్ణ తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. శ్రమదానం చేస్తూ పరిసరాల శుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యాధికారికి సన్మానం

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల 'ఫుల్ అడిషనల్ ఇంఛార్జి' మండల విద్యాశాఖ అధికారి జక్కుల రవి కుమార్‌ను శుక్రవారం రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాజా మాజీ సర్పంచ్ ఆకుల రాజేశ్వర్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెంజర్ల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న జక్కుల రవి కుమార్ మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికను విస్మరిస్తుంది

- అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలను విస్మరిస్తుందని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల ప్రభాకర్ అన్నారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్లుగా సన్నధాన్యాన్ని, దొడ్డు ధాన్యాన్నికి 500 రూపాయల బోనస్ ఇచ్చి కొనుగోలు చెయ్యాని, సిసిఐ తక్షణమే పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 15వేల రూపాయలు మద్దతు ధరతో కొనుగోలు చేయాలని, పత్తికి 500 రూపాయల బోనస్ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని ఏఐపి కె ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పట్టణంలోని కుమార్ నారాయణ్ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి. దేవారంతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ మొదటి వారం నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొందని అన్నారు. మంత్రి దొడ్డు ధాన్యానికి బోనస్ లేదని ప్రకటించడం ఎన్నికల ప్రణాళికను గంగలో కలపడమే అవుతుందన్నారు. షరతులు లేకుండా దొడ్డు, సన్నధాన్యాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలన్నారు. ఇందిరమ్మ రైతు భరోసా ఎకరాన 15 వేల రూపాయలు అతి గతి లేదని అన్నారు. తేమశాతం 10 నుంచి 15 వరకు ఉన్న సీసీఐ క్వింటాలుకు 15 వేల రూపాయలకు కొనుగోలు చెయ్యాలని డిమాండ్ చేశారు. పత్తికి, క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని.. వర్షంలో తడిసిన పత్తి, ధాన్యం, పెసర, మొక్కజొన్న, తదితర పంటలను ఎలాంటి కొర్రీ లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాజన్న. ఏరియా ప్రధాన కార్యదర్శి గంగారం, ఇస్తారు.రమేష్, ఐఎఫ్టియు నాయకులు అరవింద్ పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు జయప్రదం చేయండి : ఏఐటీయూసీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 28 మరియు 29 తేదీలలో ఏఐటీయూసీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు వ్యవసాయ మార్కెట్ యార్డులోని మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా

ఈ తరగతుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు, కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 రకాల చట్టాలు, నూతనంగా తీసుకొచ్చిన నాలుగు కోడ్లపై అవగాహన, అసంఘటిత రంగ కార్మికులు సమస్యలు. స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు తదితర అంశాలపైన ఏఐటీయూసీ అనుబంధ సంఘాల కార్యకర్తలు నాయకులకు అవగాహన కల్పించి రాబోయే కాలంలో పోరాటాలకు సన్నద్ధం చేయటం కోసం ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు టి. చక్రపాణి, కార్యదర్శి పి. హనుమాన్లు, బి. అనిల్, సంపత్, భాగ్యలక్ష్మి, కవిత, రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటిపల్లి నాగేష్ రెడ్డి కుమారుడు వికాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఇందల్ వాయి మండలంలోని యెల్ల రెడ్డి పల్లి గ్రామంలో కాంగ్రెస్‌లో కార్యకర్త గుర్రాల ప్రశాంత్ గత కొన్ని రోజుల క్రితం ఒక ప్రమాదంలో మృతి చెందారు. ఆ కుటుంబానికి ఆదుకోవడానికి వికాస్ రెడ్డి గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి తన వంతుగా 25 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో డిసిసి డెలిగేట్ తలారి సుధాకర్ ,మాజీ ఉపసర్పంచ్ బైరయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్న మోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు షారుక్ ,నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



పరామర్శిస్తున్న వికాస్‌రెడ్డి

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండల కేంద్రంలోని అతాంగ్ డిచ్ పల్లి టోల్ వే ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో తెలంగాణా మోడల్ స్కూల్ డిచ్ పల్లి లో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ అనిల్ కుమార్, టోల్ మేనేజర్ చలపతిరావు మాట్లాడుతూ విద్యార్థులు రహదారి దాటుతున్నప్పుడు ఇరువైపులా చూసుకుంటూ దాటాలని, లేకుంటే ప్రమాదాలను కొని తెచ్చుకోవడమే అవుతుందన్నారు. ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. విద్యార్థి తో పాటు ఇతరులు కూడా రోడ్డు భద్రత పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమం లో సేఫ్టీ అధికారి సతీష్, ఆపరేషన్ మేనేజర్ విరాజ్, ఉదయ్, కృష్ణ కాంత్, గణేష్, మూర్తి ప్లాజా ఇన్చార్జి వీరబాబు, ఇండిపెండెంట్ ఇంజనీర్ రామారావు, నాగేశ్వరావు, నిజామాబాద్ జిల్లా ఐఆర్ ఎడి సేఫ్టీ అధికారి వర్మా, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దశరథ్, ఇంచార్జ్ అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోదావరిలో నీటి ప్రవాహానికి ఒకరు గల్లంతు

- గాలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి మండలంలోని ధర్మారం (బి) గ్రామానికి చెందిన కర్రోళ్ల జయ ఇటీవల తన తల్లి చనిపోగా కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రం లోని గోదావరి స్నానానికి వెళ్లారు. మధ్యాహ్నం పుష్కర ఘాట్ వద్ద జయ తమ్ముడి భార్య కృష్ణవేణితో కలసి నదిలో దిగగా ఒక్కసారిగా నీళ్ల ప్రవాహానికి ఇద్దరు కొట్టుకు పోతుండగా కృష్ణవేణి దగ్గరలో ఉన్న జాలర్లు కాపాడారు. జయ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. జయ ఆచూకీ కోసం జాలర్లు, పోలీసులు, కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. దీంతో ధర్మారం (బి)లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

ఈ నెల 30న చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శుక్రవారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి సూర్య శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చిందని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ కోడ్ లను అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని డిమాండ్ చేశారు. మూడు క్రిమినల్ చట్టాల సవరణ రద్దు చేయాలని, బీడీ కార్మికులకు కనీస వేతన జీవోను ఫైనల్ చేయ్యాలని, చేయూత పథకం కింద 4000వేల జీవన భృతి అమలు చేయాలని, కార్మికులందరికీ 10వేల పెన్షన్ ఇవ్వాలని అన్నారు. ధర్నా కార్యక్రమంలో బీడీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియూ నాయకులు ఎస్.వెంకటేష్, ఎస్.గంగామణి, ఆర్.లక్ష్మి, సరస్వతి, నర్సుబాయి, రాజశ్రీ, విజయ పాల్గొన్నారు.

చికిత్స అందించడంలో నిర్లక్ష్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన రోగులకు సకాలంలో చికిత్స అందించడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం జ్వరంతో బాధపడుతూ వచ్చిన యువకుడిని ఆస్పత్రిలో అడ్మిషన్ చేసుకొని చేతికి సూది పెట్టి వదిలేసి ఇవ్వాల్సిన మందులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని, శుక్రవారం వరకు ఎటువంటి చికిత్స చేయకుండా ఉంచారని రోగి బంధువులు ఆరోపించారు. చికిత్స ఇవ్వడం లేదని డ్యూటీ డాక్టర్‌ను సంప్రదించగా రెండవ గదిలో ఎక్కువమంది పేషెంట్ లేకపోవడంతో సిబ్బంది మరిచిపోయి ఉంటారని సమాధానం ఇచ్చినట్లు వారు తెలిపారు. ఆసుపత్రిలో చేరిన వారికి సకాలంలో వైద్యం అందించకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


ఆస్పత్రిలో బాధితుడు

ప్రారంభమైన వరి కోతలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలో శుక్రవారం వరి కోతలు ప్రారంభమయ్యాయి. నాగిరెడ్డిపేట్ మండలంలోని వ్యవసాయ పనితీరులో ముందుండే వాడి గ్రామంలో శుక్రవారం వరి కోతలు ప్రారంభించారు. పంట చేతికి రావడంతో రైతు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షభావ పరిస్థితుల వల్ల మండలంలో ఒక్కో గ్రామంలో ఒక్కోరకంగా పంటలను రైతులు సాగుచేశారు.


యంత్రంతో వరికోత పనులు

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల కోసం కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా కామారెడ్డి బస్‌స్టాండ్ సమీపంలోని ఆయన విగ్రహానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సింధు శర్మ ఐ.పి.ఎస్. కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అదనపు ఎస్.పి అడ్మిన్ కే నరసింహారెడ్డి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఎస్.బి.సి.ఐ. జార్జ్, ఆర్.ఐ నవీన్ కుమార్, ఎఆర్ ఎస్.ఐలతో పాటు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ విముక్తి కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధనకు అవిరాళంగా కృషి చేసిన వ్యక్తి అని, అలుపెరుగని పోరాట యోధుడు, ఉద్యమ నేత కొండ లక్ష్మణ్ బాపూజీ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పట్టణ కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, ఇమ్రాన్ మొయినుద్దీన్, లడ్డు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి, బీసీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో..

కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతిని పద్మశాలి సంఘం, బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ కూడలి వద్ద, చర్చి ముందర గల ఆయన విగ్రహానికి పూలమాలలతో ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు సిరిగాధ లక్ష్మీనరసింలు, పట్టణ ప్రధాన కార్యదర్శి తుమ్మ రమేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సావ శివరాములు తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డి : కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్


దోమకొండ : మండల పరిషత్ కార్యాలయంలో..

బోధన్ : తొలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను బోధన్ పట్టణంలోని తట్టికోట్ గల్లీలోని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 37 వార్డు కౌన్సిలర్ మాసిని వినోద్, పద్మశాలి అధ్యక్షులు గంగుల దేవిదాస్, లోల శంకర్, చిలుక రాములు, బొడ్డు సురేష్, రాజు, భాస్కర్, రవీందర్, అశోక్, రాకేష్, అంజి, మోహన్ సభ్యులు పాల్గొన్నారు.

బీబీపేట్ : కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పద్మశాలి సంఘం డివిజన్ అధ్యక్షులు తుమ్మ మచ్చెందర్ మాట్లాడుతూ.. బడుగు బలహీనర్గాల కోసం పోరాడిన పోరాటయోధుడని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు తుమ్మ రాజేందర్, ఉపాధ్యక్షుడు దుడుగు రమేష్, కోశాధికారి గడ్డం నరేశ్, చింతకింది వేణు, సిరిగాద నాగరాజు, మామిండ్ల రమేశ్, చింతకింది సిద్దరాములు, చింతల లింగం, సింగం దత్తు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

దోమకొండ : తెలంగాణ మలి దశ పోరాట దిక్సూచి కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల పర్యవేక్షకులు మనోహర్, సీనియర్ అసిస్టెంట్ మానిక్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని దూపల్లి గ్రామంలో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సుంచుల బాబన్న మాట్లాడారు. అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన సంచుల బాబన్నను, మాజీ సర్పంచ్ శనిగరం సాయిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కిష్టయ్య, ప్రభాకర్, గుత్ప సాయిలు, దాము, నరేష్, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.


బీబీపేట్‌లో..


రెంజల్‌లో..


బోధన్‌లో..

తలనొప్పి భరించలేక ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-వర్ని

మండలంలోని శ్రీనగర్ గ్రామంలో తలనొప్పి భరించలేక లీలావతి (41) అనే మహిళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చందూర్‌లో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండల కేంద్రంలో నిజాంసాగర్ కెనాల్ నుంచి గ్రామానికి వచ్చే కెనాల్‌లో శుక్రవారం కుమ్మరి మొగులయ్య అనే వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్ఐ కృష్ణ కుమార్ వివరాల ప్రకారం.. పొతంగల్ మండల కేంద్రానికి చెందిన మొగులయ్య గత కొన్ని రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చందూర్ గ్రామంలో రెండు రోజుల నుంచి కెనాల్ నుంచి ప్రజలకు దుర్వాసన రావడంతో కెనాల్‌లో చూడగా మృతదేహం కనబడింది. ఈ సమాచారాన్ని పోలీసులకు అందించటంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుమ్మరి మొగులయ్య మృతదేహంగా గుర్తించారు. కెనాల్ నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

140 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం

- ఇద్దరిపై కేసు


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ నిర్వహిస్తున్న ఎన్‌డిపియస్ స్పెషల్ రైడ్‌లో భాగంగా కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి బి.హన్మంతరావు ఆదేశాల మేరకు కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది శుక్రవారం మండలంలోని వజ్జపల్లి గ్రామంలో సోదాలు నిర్వహించారు. ఎక్సైజ్ అధికారి విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సోదాల్లో భాగంగా కామిండ్ల రాజశేఖర్ వద్ద 70 గ్రాముల ఎండుగంజాయి లభించింది. దీంతో ఆయనను విచారణ చేయగా.. యాచారం గ్రామానికి చెందిన తిరుపతి వద్ద తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద సైతం సోదాలు నిర్వహింగా.. మరో 70 గ్రాముల ఎండు గంజాయి లభించింది. ఇద్దరి వద్ద 140 గ్రాముల గంజాయిని, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో సిబ్బంది మైసరాజు సంతోష్, రాథోడ్, ఆంజనేయులు, దేవకుమార్, రమ శ్రీ రాగ పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా పట్టివేత

నవతెలంగాణ-బిచ్కుంద

తెలంగాణ రాష్ట్రం నిషేధించిన గుట్కా సంబంధించిన పదార్థాల సంచులను తరలిస్తున్న ట్రాలీ ఆటోను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు బిచ్కుంద ఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రంలోని ఔరాద్ నుండి బిచ్కుందకు ట్రాలీ ఆటోలో బుర్రేవార్ సంతోష్ నిషేధిత గుట్కా సంచులను తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు ఆటోను డ్రైవర్‌ను అదుపులో తీసుకొని పరిశీలించగా 60 కి పైగా నిషేధిత గుట్కా సంచులు ఉండడంతో ఆటోను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.


పట్టుకున్న గుట్కా వాహనం

పోలీస్‌స్టేషన్‌పై దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-రామారెడ్డి

గురువారం అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌పై, హెడ్‌కానిస్టేబుల్‌పై దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హెడ్‌కానిస్టేబుల్ రాజ నరసయ్యపై, పోలీస్‌స్టేషన్‌పై మండల కేంద్రానికి చెందిన బిట్ల రవి దాడికి ప్రయత్నించాడు. స్థానిక సిబ్బంది కల్పించుకుని ఆయనను కట్టడి చేశారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ రాజ నరసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఆ వ్యక్తిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- మండల ప్రత్యేక అధికారి సతీష్ యాదవ్

నవతెలంగాణ-బీబీపేట్

గ్రామాల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి సతీష్ యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తుజాల్పూర్, శేరిబిపేట్ గ్రామాల్లో పర్యటించారు. ముందుగా శేరిబిపేట్‌లో స్కూలు, అంగన్వాడీలో శానిటేషన్‌ను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని, అలాగే రెండు అంగన్వాడీ కేంద్రాలను, ప్రైమరీ స్కూలును పరిశీలించారు. గ్రామంలో శానిటేషన్‌ను పరిశీలించారు. తుజార్పూర్‌లోని పల్లె దవఖానాలో సీజనల్ వ్యాధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బంతి పూర్ణ చంద్రోదయం, ఎంపీఓ కృష్ణ, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులున్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వైద్యులు వెంకటేష్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మల్టీ పర్పస్ వర్కర్స్ గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు భానుప్రియ, జ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓను సన్మానించిన మాజీ జెడ్పిటిసి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలో ఆరు సంవత్సరాలుగా సేవలందించిన ఎంఈఓ వెంకటేశంను మాజీ జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి శుక్రవారం శాలువాతో సన్మానించారు. గత ఆరు సంవత్సరాల నుండి మండలానికి సేవలందించినందుకుగాను కృతజ్ఞతగా సత్కరించినట్లు ఆయన పేర్కొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన షేక్ జైతున్ బి తన మనమరాలు వివాహానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ రూ.5011 పంపించిన ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నర్సింగరావు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుదర్శన్, సొసైటీ చైర్మన్ కృష్ణగౌడ్, పార్టీ నాయకులు రాజనర్సింహారెడ్డి, రాజాగౌడ్, రవీందర్ గౌడ్, షేక్ మౌలానా, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు కంటి వైద్య నిపుణులు భాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి శిబిరంలో 25 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించగా 12 మందికి చూపు మందగించడంతో వారికి మందులు , ఐ డ్రాప్స్ అందజేసినట్లు ఆయన తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కాశిరెడ్డి, క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త చేపూరి రమేష్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు గంప శశాంక్ రమేష్‌ను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రామేశ్వర్‌పల్లి గ్రామ అధ్యక్షులు అనంత్ కుమార్ గౌడ్, యూత్ అధ్యక్షులు మధు, మండల యువజన విభాగం అధ్యక్షులు రంజిత్ వర్మ నాయకులు స్వామి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కంటి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కంటి వైద్య నిపుణులు రవీందర్ పాటిల్ శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించి కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

మండల ఉపాధ్యక్షుడికి అభినందనలు తెలిపిన గ్రామస్తులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఇటీవల జరిగిన అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీలో ఎల్లారెడ్డి మండల ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రుద్రారం గ్రామానికి చెందిన పద్మారావుకు పలువురు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కమిటీలో రుద్రారం గ్రామం తరపు నుంచి చోటు దక్కినందుకు హర్షం వ్యక్తం చేశారు. బహుజన వర్గాల ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని, నిస్సహాయులకు అండగా నిలవాలని సూచించారు. ప్రజాసేవలో ముందుకు సాగుతూ మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సంజీవ్, సాయిబాబా, రాజు, సాయిలు, శీను, వెంకటరాములు, బాబు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణస్వీకారం

- ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రజిత వెంకట్రాంరెడ్డి
- వైస్‌చైర్మన్‌గా రాజు
- నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎమ్మెల్యే, ఎంపీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్


నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే, ఎంపీ

ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్‌హాలులో స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ఎంపీ సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా రజిత వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్‌గా రాజుతో పాటు లింగంపేట్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాలకు ఎన్నికైన నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ.. ప్రమాణ స్వీకారానికి విచ్చేసిన రైతులకు, అధికారులకు, నాయకులకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ గొప్పగా అభివృద్ధి చెంది ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతుల సంక్షేమం గురించి ఆలోచించాలన్నారు. మీ కుటుంబంలోని చదువుకునే పిల్లలకు అగ్రికల్చర్ కోర్సులో చేరి సరికొత్త విధానాలను రూపొందించే విధంగా ప్రోత్సహించాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సరైన సమయంలో ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.

జిల్లా ఏఎంసి అధికారి రమ్య, వ్యవసాయ కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, మాజీ జెడ్పిటిసి గయాజుద్దీన్, మాజీ ఎంపిటిసి శకావత్ అలీ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, సతీష్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రానికి చెందిన డాక్టర్ జొన్నల రాజు ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేశారు. లింగంపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు జొన్నల రాజుకు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. వార్డు మెంబర్ నుండి అంచెలంచెలుగా ఎదిగి ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో పలువురు ఆయనను అభినందించారు.

ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు పూర్తి

- ఎంఈవో దేవిసింగ్

నవతెలంగాణ-పిట్లం



ప్రశంసాపత్రాలతో ఉపాధ్యాయులు

విద్యార్థులకు కౌమార దశలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే పలు అంశాలపై ఉపాధ్యాయులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బ్లూబెల్స్ పాఠశాలలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులు పూర్తయినట్లు మండల విద్యాధికారి దేవిసింగ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిట్లం, నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్, మహ్మద్‌నగర్ మండలాలకు చెందిన 36 మంది ఉపాధ్యాయులకు విద్యార్థులకు కౌమార దశలో ఎదురయ్య సవాళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలి, ఒత్తిడితో కూడిన పరిస్థితులను అధిగమించడానికి ఎదురయ్యే సవాళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలి, ఒత్తిడితో కూడిన పరిస్థితులను అధిగమించడానికి నైపుణ్యాల అభివృద్ధి చేయడం, కాగా విద్యార్థులలో భావోద్వేగాలు గుర్తించడం, నియంత్రించడం ప్రమాదకర ప్రవర్తనలకు విద్యార్థుల ప్రతిఘటనను, బలోపేతం చేయడం, స్వీయ అవగాహన, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడం వంటి పలు అంశాలపై రెండు రోజులపాటు శిక్షకురాలు డాక్టర్ లక్ష్మీ మూర్తి శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ నారాయణ, డిస్ట్రిక్ గవర్నర్ అమర్నాథ్‌రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కాశిరెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు బెజుగం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.